
# నేను భారతిని కాను

— వంక సరస్వతి



బయట పందిట్లో మోగుతున్న బజంత్రీలు గదిలో ఉన్న భారతికి వినిపిస్తూనే ఉన్నాయి. నుదుట కళ్యాణ తిలకంతో, బుగ్గన కాటుక చుక్కతో, ఎర్రని పట్టుచీరలో ఉన్న భారతి అప్పుడే విచ్చుకుంటూన్న ముద్ద మందారంలా ఉంది.

పెళ్ళికూతురికి ఉండవలసినంత సంతోషంతోపాటు, ఉండకూడనంత విచారం కూడా కలుగుతోందామెకి.

మళ్ళీ శుభలేఖ తీసి చూసింది. అప్పటికి అదెన్నోసారో.

చి॥ అగ్నిహోత్రావధాన్లుకి, చి॥ సౌ॥ భారతినిచ్చి.

ప్చ్.... ఆమె గాఢంగా నిట్టూర్చింది. మనసులోని అసంతృప్తికి లయగా చేతిలోని శుభలేఖ నలుగుతోంది.

సరిగ్గా పదిహేనురోజుల ముందర జరిగిన సంఘటన జ్ఞాపకంవచ్చిందామెకి. అరోజు పెళ్ళివారు రావటం, తనని చూసి అక్కడికక్కడే నచ్చిందని చెప్పటమే కాకుండా అమ్మాయి అభిప్రాయంకూడా తెలుసుకోండి అనటంతో తన పరిస్థితి కూడా యిరుకునపడ్డట్టైంది.

వంటింట్లో తల్లీ, తండ్రి ఆనందంగా గుసగుసలాడుకోవటం వినిపిస్తూనేఉన్నా తీరా తండ్రి వచ్చి తనని అడిగితే ఏం చెప్పాలా అని భారతి అలోచిస్తూ నిలబడిపోయింది.

ఆమె వూహించినట్లుగానే శేషాచలంగారు భారతిఉన్న గదిలోకి వచ్చి తలుపులు దగ్గరగా మూశారు.

తలవంచుకుని నిలబడి ఉన్న భారతిని చూసి, అప్పుడే తన కూతురికి పెళ్ళికళ వచ్చేసిందనుకుంటూ, "అమ్మాయ్! భారతీ ఈ సంబంధం నీకిష్టమే కదూ" అన్నారు.

.... .... ....

ఆమె నుంచి ఎంతకీ సమాధానం రాకపోయేసరికి,

"ఏమ్మా, నీ కిష్టంలేదా?" అన్నారు ఆందోళన నిండిన స్వరంతో.

అంత బావున్న పెళ్ళికొడుకు భారతికి ఎందుకు నచ్చలేదో అంతుపట్టట్లేదు ఆయనకి.

"అతని పేరు నాకు నచ్చలేదు నాన్నా" కూడదీసుకుంటూ అంది భారతి.

ఆ మె జ వా బు ఆమెకే సిల్లీగా అన్పించింది.

శేషాచలంగారికి పెళ్ళున నవ్వాలనిపించినా, ప్రక్కగదిలో పెళ్ళివారుండడంతో ఆ ప్రయత్నం విరమించుకుని చిరునవ్వు నవ్వారు.

ఆ నవ్వు లోకంతెలియని పసిపాపని చూసి నవ్విన నవ్వులా ఉంది.

"నువ్వింకా ప్రపంచం తెలియని పసిదానవమ్మా. కేవలం యింత చిన్న కారణంగా ఈ సంబంధం వదులుకుంటే, మళ్ళీ జన్మలో యిలాంటిది తేగలమా? పెళ్ళికొడుక్కి ఏంతక్కువైంది చెప్పు. అందగాడు, బుద్ధిమంతుడు. పెళ్ళాన్ని పోషించుకోగల ఉద్యోగం ఉంది. కొద్దోగొప్పో ఆస్థి ఉంది. మంచి సాంప్రదాయం, పూజాపునస్కారాలు గల కుటుంబం. పైగా అన్నిటికీ మించి, పిల్లే ముఖ్యం కట్నం అక్కర్లేదంటున్నారు. నీ అభ్యంతరం కేవలం అదే అయితే, నామాట విని ఈ పెళ్ళికి ఒప్పుకోమ్మా.

సుఖపడతావు" నచ్చచెప్పే ధోరణిలో అన్నారు శేషాచలంగారు.

భారతికి తండ్రి చెప్పింది నిజమే ననిపించింది

ఆయన మాటల్లో అతని మంచితనం అర్థమైంది. నిజం చెప్పాలంటే తనే అతని ముందర వామన ఛాయగా ఉంటుంది. పేరుదేం ఉంది, పెళ్ళైన తరువాత మెల్లిగా మార్పించే ప్రయత్నం చేయవచ్చు అనుకున్న భారతి తండ్రికి తన అంగీకారాన్ని తెలియజేసింది.

ఆ తరువాత నాలుగు రోజుల్లోనే తాంబూలాలు పుచ్చుకోవటమూ, పెళ్ళి ముహూర్తం పదిహేను రోజుల్లో నిర్ణ యించటమూ జరిగిపోయాయి,

అయితే ఆమె పదేళ్ళ చెల్లెలు ఉష, పెళ్ళి నిశ్చయంఅయిన రోజునుంచీ బావగారి పేరుచెప్పి భారతిని ఉడికిస్తూనే ఉంది. దాంతో మర్చిపోదామనుకున్నా అతని పేరు ముల్లులా తయారై ఆమె మనసుని అసంతృప్తికి లోనుచేసింది.

"ఏమే, యిక్కడ ఒక్కదానివీ కూర్చున్నావా? అవతల బ్రాహ్మడు గౌరీ పూజకి వేళయిందని కంగారు పెడ్తూంటే" అంటూ శారదాదేవి హడా విడిగా వచ్చింది. భారతిఆలోచనలలోంచి తేరుకుని మౌనంగా తల్లిని అనుసరిం చింది.

* * *

వివాహం యథావిధిగా ముగిసింది. వధూవరులిద్దరూ పీటలమీదనుండి లేచి యింటి లోపలికి రాబోయారు. కానీ ఆడవాళ్ళు గుమ్మానికి అడ్డంగా నిలబడి వాళ్ళిద్దర్నీ పేర్లుచెబితే తప్ప లోపలికి రానివ్వమని కచ్చితంగా చెప్పారు.

భారతి భర్తవేపు ఓమాటు చూసి తలదించుకుంది. తరువాత అతని చేతిలో ఉన్న తన చేతివంక చూసుకుంది.

తను భయపడ్తున్న సమయం రానే వచ్చింది. అతనిపేరు చెప్తే తప్ప తనని వాళ్ళు విడిచిపెట్టరు.

"త్వరగా చెప్పాలి" గుమ్మం దగ్గర నిలబడ్డవాళ్ళు కొంత కుతూహలంగాను, కొంత అసహనంగాను అన్నారు.

అగ్నిహోత్రావధాన్లు భారతి కేసి క్రీగంట చూస్తూ, చిరునవ్వు నవ్వి,


"నేనూ భారతీ వచ్చాం" అన్నాడు బిగ్గరగా.

భారతి ఎంతకీ చెప్పకపోయేసరికి, "ఏమమ్మా అంత సిగ్గయితే ఎలా?త్వరగా చెప్పాలి మరి" అన్నారు ముత్తకంఠంతో

తనకి భర్తపేరు చెప్పటం సిగ్గను కుంటున్నారు కాబోలు. అతని పేరు ఏ సురేషో, రమేషో అయితే ఒకమాటు కాదు, వందమాట్లయినా చెబుతుందని, ఈ పేరు తనకి పలకటం కూడా సరిగ్గా రావటల్లేదని ఎలా తెలుస్తుంది వీళ్ళకి.

"భారతీ త్వరగా చెప్పేయ్" మెల్లగా అన్నాడు అవధాన్లు.

"నేనూ, అగ్నిహో...." ఎవరో




పక్కున నవ్వటంతో భారతి మొహం నల్లగా అయ్యింది.

మా కసలు వినపడనేలేదని అన్నారు చాలామంది.

"నాకు వినపడిందిలెండి" అంటూ అవధాన్లు భారతిని లోపలికి లాక్కుపోయాడు.

భారతి భర్త వంక కృతజ్ఞతగా చూసింది.

భారతి అవధాన్లుతో కాపురం పెట్టి ఆరు నెలలైంది. ఈ ఆరునెలల వైవాహిక జీవితం ఆమెకి ఆనందాన్ని కలిగించక పోగా అసంతృప్తినే మిగిల్చింది.

అతను భారతిని ఎంతో బాగా చూసు కుంటున్నప్పటికీ, ఆమెకి జీవితం మెకానికల్‌గా, డల్‌గా అన్పించసాగింది.

నిజానికి ఆమెకి ఏలోటూ లేదు. ఆ యింటికి ఆమె మహారాణి. అయినా చిన్న చిన్న కోరికలు తీరక పోవటం వల్ల తనకేదో అన్యాయం జరిగిపోయినట్లూ, తను జీవితంలో సర్వం కోల్పోయినట్లూ ఫీలవ్వసాగింది.

ఉదాహరణకి— సాయంత్రంపూట ఆమెకి భర్తతోకలిసి సినిమాకో, షికారుకో వెళ్ళాలని ఉంటుంది. అది చిన్న కోరికే అయినప్పటికీ ఆమెకి తీరేదికాదు. ఎందు కంటే ఉదయం, సాయంత్రం అతను విధిగా ఏవో పూజలు చేస్తూఉంటాడు. అలా అని ఆమెని ఎక్కడికీ తీసుకు వెళ్ళడని కాదు. సినిమాకి వెళ్ళాలంటే

సెకండ్ షోకి, ఏదైనా షాపింగ్‌కి వెళ్ళాలంటే సాయంత్రం ఏడు తర్వాత వెళ్తారు. భారతికి సెకండ్ షోలంటే చిరాకు - నిద్ర ఆపుకోలేదు. అందుకని సినిమాలు చూడాలన్న ఆలోచన మానుకుంది.

అంతేకాక అతనెప్పుడూ తన సమక్షంలోనే కబుర్లు చెప్తూ ఉండాలని ఉంటుంది. కానీ అతను ప్రతిదానికి లిమిట్స్ ఉండాలంటాడు. పైగా పేరు మార్చుకోమంటే అది అతని తాతగారి పేరంటూ తనమీద కోపం తెచ్చుకున్నాడు. చుట్టుప్రక్కల జంటలన్నీ సరదాగా తిరుగుతూ ఉంటే ఆమె మనసు భారంగా మూల్గుతుంది తను నాస్తికురాలు కాకపోయినప్పటికీ, అతని ఆస్తికత్వం ఆమెకి విసుగు కలిగిస్తోంది. అతని ప్రవర్తనకీ, తన ఆలోచనకి పొంతన కుదరక ఆమెకి వంటరితనం భరించరానిదైంది. రోజులు నిస్సారంగా గడుస్తున్నాయి.

సరిగ్గా ఆ సమయంలోనే యింటికి వచ్చిన తండ్రిని చూసి భారతి మనసు చంటిపిల్లలా గంతులువేసింది.

కమ్మని పిండివంటలతో తండ్రికి భోజనం పెట్టింది. అది కావాలా, యిది కావాలా అని అడుగుతూ అనుక్షణం తండ్రి చుట్టూ తిరిగింది.

ఈ ఆరునెలల నుంచీ మర్చిపోయిన కబుర్లెన్నో చెప్పింది. ఆమె ఆనందానికి పట్టపగ్గాలు లేకుండా ఉన్నాయి. కూతురి సంతోషం చూస్తోంటే శేషాచలంగారి మనసంతా ఆనందంతో నిండిపోయింది. తీరా తను వెళ్తాననేసరికి బిక్కమొహం వేసిన కూతుర్ని చూసి లాలనగా అన్నారు.

"యింకెంతమ్మా, పండుగ మూడు నెలలే కదా. యిద్దరూ వద్దురుగాని. అతను కూడా ఒప్పుకున్నాడు."

"ఊహూఁ నేను యిప్పుడే వచ్చేస్తాను నాన్నా. నాకు యిక్కడ ఉండాలని లేదు." కళ్ళల్లో నీరూరుతుంటే దిగులుగా అంది భారతి.

"ఏమ్మా! నీకేం తక్కువైంది. యిక్కడ సుఖంగా లేదా? అతను నిన్ను బాగా చూడటల్లేదా?" ఆయన స్వరంలో ఆందోళన స్పష్టంగా వినిపించింది.

అవును ఏం తక్కువైందని చెబుతుంది. అసలు నిజంగా తనకేం తక్కువైంది. అన్నీ ఉన్నాయి. భర్త మంచివాడే. తనని ప్రేమగా చూస్తాడు. పరస్త్రీల వేపు కన్నెత్తి చూడడు. తాగుడు, పేకాట ఊహూఁ అసలే లేవు. అయినా ఏదో తక్కువైంది. ఏదో లేదు. ఆ ఏదీ ఏమిటో తను చెప్పలేకపోతోంది. తెలియని బాధేదో మనసుని పీడిస్తోంది.

భారతి మౌనం ఆయన కంగారుని మరింత ఎక్కువచేసింది.

"చెప్పమ్మా భారతీ. అల్లుడితో మాట్లాడమన్నావా?"

"అహఁ... అదేంలేదు నాన్నా. ఆయన

నన్ను ఎంతో బాగా చూసుకుంటారు. అమ్మా వాళ్ళని చూడాలనిపించి వస్తా నన్నాను. ఎప్పుడూ అమ్మని వదిలి యిన్ని రోజులు ఉండలేదుకదా అందుకే బెంగగా ఉంది." అంది బలవంతంగా నవ్వుతూ.

భారతి సమాధానం ఆయనకి తృప్తి కలిగించింది.

"అవునమ్మా. బెంగ సహజమే. కానీ పెళ్ళయ్యాక తప్పదు కదా. మొదటి పండుగకి యిద్దరూ కలిసివస్తే బాగుంటుంది. నిన్ను యిప్పటి నుంచీ తీసుకువెళ్తే అల్లుడు యిబ్బంది పడ్తాదేమో,"

మళ్ళీ ఆయనే అన్నారు.

"మీ యిద్దరి మధ్యా ఏవైనా చీకాకులు ఏర్పడితే సరిపెట్టుకుని, సర్దుకుపోవటం అలవాటుచేసుకోవాలమ్మా. తెలివితేటల్తో మార్చుకోవాలి తప్ప యిలా బెంగపెట్టు కుంటే కష్టం కదూ."

చిన్నప్పటి నుంచీ కావాలని అను కున్నవి పొందటమేతప్ప సర్దుకుపోవటం తెలియదు తనకి. సరిపెట్టుకోవాలి. సర్దుకుపోవాలి అనే మాటలు ఆ రోజు క్రొత్తగా అనిపిస్తున్నాయి ఆమెకి.

"అలాగే నాన్నా. మే మిద్దరం కలిసే వస్తాము. అమ్మా వాళ్ళని అడిగానని చెప్పండి." అంటూ తండ్రికి వీడ్కోలు చెప్పింది.

తండ్రి వెళ్ళిపోయిన తరువాత భారతి మళ్ళీ రొటీన్‌లో పడిపోయింది.

భర్తకి వండిపెట్టటం, రెండుపూటలా పూజకి అమిర్చిపెట్టటం, నిద్రపోవటం, స్నేహితులు ఎవరూ లేకపోవటంతో గంటలకొద్దీ ఆలోచిస్తూ గడపటం యిదే లోకం

* * *

ఆ రోజు శివరాత్రి. భారతి ఉదయాన్నే లేచి తలంటుపోసుకుంది.

పండుగని కాదు. ఆ రోజామె పుట్టిన రోజు.

గదిలో బట్టలు కట్టుకోబోతున్న భారతికి పెరటి తలుపు తీసిన చప్పుడు వినిపించింది. అంటే భర్త స్నానంచేసి వస్తున్నాడన్నమాట. బట్టలు తీసుకోవ టానికి అతను గదిలోకే రావాలి. భారతి హృదయం ఎందుకో ఝల్లుమంది.

అర్ధనగ్నంగా ఉన్న తనని చూసి వచ్చిన పని మర్చిపోయి కౌగిట్లో బంధిస్తాడా? అదే జరిగితే తను సిగ్గు పడుతూ అతని చేతుల్లో కరిగిపోతుంది. అలా జరగాలనే కోరుకుంటోంది బట్టలు కట్టుకోవటం మానేసి అతని రాకకోసం కళ్ళు వెశల్పుచేసుకొని ఎదురుచూస్తోంది భారతి. అతని అడుగుల చప్పుడు దగ్గ రవుతున్నకొద్దీ ఆమె గుండె వేగం హెచ్చి, శరీరం సన్నగా కంపించ సాగింది.

లోపలి కడుగుపెట్టిన భర్తని ఓరగా కంటికొసలనుంచి పరికిస్తోంది.

ఆ స్థితిలో భార్యని చూసి చూడ

కూడని దృశ్యం చూసినట్లు, అతను బీరువాలో తలదూర్చి చేతికందిన బట్టలు తీసుకుని రెండంగల్లో బయటపడ్డాడు.

భారతి హతాశురాలైంది. దుఃఖం ఉప్పెనగా ముంచుకొచ్చింది. అలా ఎంత సేపు ఏడ్చిందో ఆమెకే తెలియదు.

దుఃఖం ఉపశమించి ఆమె బయటకి వచ్చేసరికి అతను నిశ్చింతగా పూజ చేసుకుంటున్నాడు.

* * *

సాయంత్రం ఐదుగంటలకి అవధాని యింటికి వచ్చేసరికి, భారతి డల్‌గా ముడుచుకుని పడుకుంది.

"ఏం డియర్ అలా వున్నావ్‌ః కొత్త చీరైనా కట్టుకోకుండా ?" అనురాగంగా ఆమెను దగ్గరకు తీసుకుంటూ అన్నాడు అవధాన్లు

భారతి భర్త కళ్ళల్లోకి సూటిగా చూసింది.

అతని చూపుల్లో చల్లదనం మాటల్లో మృదుత్వం, చేతల్లో సున్నితత్వం ఎప్పటిలా ఆమె మనసులోని కోపాన్ని కరిగించి వేశాయి. అతని గుండెలమీద తల ఆన్చి వెక్కి వెక్కి ఏడ్చింది.

"ఎందుకు ?" అన్నాడు అశ్చర్యంగా.

సమాధానం రాకపోగా ఆమె దుఃఖం మరింత ఎక్కువైంది

అతను ఆమెని పసిపాపని బుజ్జగించినట్లు అక్కున చేర్చుకున్నాడు,

దగ్గర ఉండి టిఫిన్ తినిపించాడు. షికారుకి తీసుకెళ్ళాడు.

అతని అనునయంతో భారతి మామూలు భారతి అయిపోయింది.

దారిలో సంతోషంగా అడిగింది. "యివ్వాళ. పూజ లేదా ?"

"ఎందుకు లేదు. శివరాత్రి కదా. రాత్రితెల్లవార్లూ చేస్తాను. జాగారం కూడా అవుతుంది."

ఆమె ఉలిక్కిపడింది. ఏదో నిస్సత్తువ శరీరమంతా వ్యాపించినట్లై,

"యిక నడవలేను బాబూ, యింటికి పోదాం" అంది.

అవధాన్లు ఆమెకేసి ఆశ్చర్యంగా చూసి 'పద' అన్నాడు.

యింటికి వచ్చీరావటంతోనే ఆమె అతన్ని లతలా పెనవేసుకుపోయింది.

మెల్లిగా విడిపించుకుంటూ అన్నాడు. "యివాళ్ళ మహాశివరాత్రి. సంవత్సరానికి ఒకేసారి వస్తుంది. నేను పూజ చేసుకోవాలి."

దెబ్బతిన్నట్లు అతని వేపు చూసింది.

నా పుట్టినరోజు కూడా సంవత్సరానికి ఒకేసారి వస్తుంది అని ఆమె అనలేదు. అనేంత చనువు అతనిదగ్గర ఆమెకి లేదు.

కానీ అభావం ఆమె కళ్ళల్లో చదివివవాడిలా "చూడు భారతీ. తీపి తినడానికి ఎంత బాగుంటుంది. అలా అని ఎక్కువగా తించే మొహం మొత్తుతుంది." అర్థంచేసుకో అన్నట్లు చూశాడు.

"కాదని ఎవరన్నారు ? అసలు తినటం మానేస్తే సరి. జబ్బులు రావు" రోషంగా అని గోడకేసి తిరిగి పడుకుంది.



అతను సన్నగా నవ్వుకుని పూజగది లోకి వెళ్ళిపోయారు.

పన్నెండు .... ఒకటి.... రెండు....

భారతికి ఎంతకీ నిద్ర రావటల్లేదు. పడకమీద అడ్డదిడ్డంగా దొర్లుతోంది. మనస్సులో ఆవేదన. అలా అని ఏడుపు రావటల్లేదు. భర్తమీద కసి. తనమీద తనకే కసి.

బెడ్‌రూమ్ తలుపులు తెరుచుకుని మాలతి పందిరిదగ్గరికి వచ్చింది. గాలిలో తేలివస్తున్న పూలవాసన, చల్లటి గాలి ఆమెకి హాయి కలిగించాయి. మనసులో అలజడి కాస్త తగ్గినట్లనిపించింది. చుట్టూ గాఢాంధకారమైనా ఆమెకి భయం వెయ్యలేదు. అలా ఎంతసేపు నుంచునేదో తెలియదు గానీ రెండు యినుప హస్తాలు తనచుట్టూ బిగుసుకోవటంతో ఉలిక్కిపడింది.

ఎవరివా చేతులు.... భర్తవా?.... ఊహుఁ కాదు.... మరి?

బహుశ అవుట్ హౌస్‌లో ఉంటున్న బోసుబాబు వేమో! .. కావచ్చు.

అలా అనుకోగానే ఆమె గుండె ఝల్లుమంది.

ఆమె మౌనంతో కౌగిలి మరింత బిగిసింది.

వద్దు.... వద్దు.... అని గట్టిగా అరవాలనుకుంది. కానీ విచిత్రంగా గొంతులోంచి మాటే రాలేదు. అప్పటికే ఆమె శరీరాన్ని మైకం కమ్మేసింది.

బోసుబాబు రెండుచేతుల్తోనూ ఆమెను ఎత్తుకొని తన గదిలోకి తీసుకెళ్ళాడు.

* * *

సరిగ్గా గంట తరువాత తన గదిలో పడుకున్న భారతికి శరీరమంతా తేలిక పడి హృదయం బరువెక్కసాగింది.

జరిగింది తలుచుకుంటే ఆమె మెదడు స్థంభించినట్లయింది.

తను.... తను.... ఏం చేసింది? ఎలా చెయ్యగలిగిం దిలాటిపని? ఆ అనురాగ మూర్తికి ఏలా తన మొహం చూపించటం? ఆమె మనసులో బాధ సుళ్ళు తిరుగుతోంది.

కారెక్టర్ ఈజ్ లాస్ట్- ఎవ్రీథింగ్ ఈజ్ లాస్ట్.

అవును.

యిప్పుడు తనదగ్గర తనదంటూ ఏమీ లేదు. గంట క్రితంవరకూ తను పవిత్రురాలు. శీలవతి. యిప్పుడు అపవిత్రురాలు. ఒక గంట కాలానికి యింత శక్తి ఉందా? అయితే మరోగంటకి తను మళ్ళీ శీలవతి అవుతుందా.

అంత దుఃఖంలోనూ భారతికి నవ్వు వచ్చింది.

యిప్పుడు తను అవధాని యిల్లాలు కాదు. కులట.... పతిత.... అబ్బా!.... తన మనసు తనకే కఠోరంగా విప్పిస్తోంది. అంతకు ముందు అతనితో పొందిన అనుభూతి తుడిచిపెట్టుకుపోగా, కారుమేఘమేదో తనని కబళించటానికి వస్తోన్నట్లు ఉండి ఉండి ఉలిక్కిపడుతోంది. కళ్ళనుంచి ధారాపాతంగా నీళ్ళు కారిపోతున్నాయి. అలా చాలాసేపు అచేతనంగా పడివుంది. తరువాత ఓ నిర్ణయానికి వచ్చి కళ్ళుతుడుచుకొని లేచింది.

భర్త ఏంచేస్తున్నాడో చూడాలనిపించి పూజగదిలోకి తొంగిచూసింది.

అతను అవిరామంగా శివలింగానికి కళ్ళుమూసుకుని అభిషేకం చేస్తున్నాడు. పెదవులు ఏదో మంత్రాన్ని ఉచ్చరిస్తున్నాయి. తలుపు చప్పుడైనా అతను పక్కకి తిరిగిచూడలేదు.

బహుశ అతని మనసు శివసాన్నిధ్యాన్ని చేరుకుందేమో.

ఆమె గిరుక్కున వెనుతిరిగింది.

* * *

నూతిలోంచి తీసిన భారతి శవంమీద పడి ఆమె తల్లితండ్రులు హృదయవిదారకంగా రోదిస్తున్నారు.

గోడకి ఆనుకుని కూర్చున్న అవ

ధాన్లులో చలనంలేదు. రాయిలా బిగుసుకు పోయాడు. అతని మంచితనం ఎరిగున్నమీదట అతన్ని నిందించటాని కెవరూ సాహసించలేదు. వచ్చిన పెద్ద మనష్యులే పోలీస్‌కేస్ కాకుండా జరగ వలసిన కార్యక్రమాన్ని జరిపించారు.

అందరూ వెళ్ళిపోయిన తరువాత ఒక్కడూ ఒంటరిగా మిగిలిపోయాడు.

యిల్లాలులేని యిల్లు పాడుబడ్డ శ్మశానంలా ఉంది. అతనికి భగవంతుడంటే నమ్మకం పోయింది. తెల్లవార్లూ శివుడ్ని అభిషేకించినది తన భారతిని తీసుకు పొమ్మనా? యిన్నిరోజుల పూజాఫలితం యిదేనా?

అతడు దేముడి బొమ్మలన్నిటినీ ఒకొ్కక్కటీ వీధిలోకి విసిరికొట్టాడు. యిప్పుడతని మనసులో ఉన్న ఒకే ఒక దేవత భారతి మాత్రమే.

అవధాన్లుకి అర్థంగాని ప్రశ్న ఒక్కటే. ఎందుకింత పనిచేసి భారతి తనకెందు కింత అన్యాయం చేసింది.

'నేను నీకు ఏం తక్కువ చేశాను భారతీ! నా అలవాట్లు నిన్నింత బాధించాయని ఒక్కమాట చెప్పిఉంటే నన్ను నేను మార్చుకునేవాణ్ని కదా. యింత చిన్న తప్పుకు అంత శిక్ష వేస్తావా?'అతని మనసు జంటను కోల్పోయిన పక్షిలా మూగగా ఆక్రోశిస్తోంది. ఇరవైనాలుగు గంటలూ భారతి ఫోటోముందే కూర్చుంటాడు. అసలు భారతి యికలేదు అన్నది యదార్థం అన్పించటల్లేదు. కాదు అని నిరూపించటానికి భారతి లేదు. ఆ యింట్లో ప్రతిగోడ, ప్రతి తలుపు, ప్రతి వస్తువూ భారతే అయి రా రమ్మని తనని ఆహ్వానిస్తున్నట్లు భ్రాంతి కలుగుతోంటే పిచ్చివాడిలా యిల్లంతా కలియతిరుగుతాడు. ఆ యింట్లోనే ఉంటే నిజంగా పిచ్చివాడై పోతాడేమోనన్న భయంతో, అతని స్నేహితులు కొందరు బలవంతంగా అతనిచేత యిల్లు ఖాళీచేయించారు.

* * *

కాలానికి ఎటువంటి బాధలనైనా మరిపించేశక్తి లేకపోతే,మనషుల తీరు మరోరకంగా ఉండేదేమో.

నాలుగేళ్ళు గడిచేసరికి అతనిలో భారతి తలపులు కొంతవరకు మరుగున పడ్డాయి. ఈ నాలుగేళ్ళనుంచీ అతని తల్లిదండ్రులు ఎంతచెప్పినా తిరిగి వివాహానికి అంగీకరించలేదు.

మామూలు ప్రకారం ఆరోజు అవధాన్లు ఇంటికివచ్చేసరికి, ముందుగదిలో తండ్రిగారితో మాట్లాడుతున్న మాజీమామగార్ని చూడగానే చాలా ఆశ్చర్యపడ్డాడు.

అల్లుడ్ని చూసిన శేషాచలంగారు, భారతి పోయాక పదేళ్ళు వయస్సు పెరిగినట్లున్నాడు అని అనుకున్నట్లే, మామగారు కూతురుపోయాక యింకా పాతికేళ్ళు ముసలివాడైనట్లు కనిపించారు అవధాన్లుకి.

కుశలప్రశ్న లయ్యాక అతను 'అమ్మా ' అంటూ వంటింట్లోకి వెళ్ళబోయినవాడల్లా గుమ్మంలో కూర్చున్న భారతిని చూసి నిశ్చేష్టుడయ్యాడు.

వెంటనే భారతీ–భారతీ అంటూ ఆమె భుజాలు పట్టుకుని కుదిపేశాడు. వెనక్కి తిరిగిన అవధాన్లు తల్లి "ఆ అమ్మాయి భారతి కాదురా. ప్రమీల. భారతీవాళ్ళ పిన్నికూతురు," అంది కంగారుగా.

హీరో అనుకున్నవాడు కాస్తా విలన్ అయిపోయినట్లు అదిరిపడి చూస్తోన్న ప్రమీలకేసి తిరిగి "క్షమించండి. భారతిలా అన్పిస్తే భారతే అనుకున్నాను" అని నొచ్చుకుంటూ అక్కడనుంచి వెళ్ళిపోయాడు అవధాన్లు.

అతనివెనకే వచ్చిన తల్లి అవధాన్లుతో అంది, "అమ్మాయి బుద్ధిమంతురాలు. వినయ విధేయతలుగల పిల్ల, కుందనపు బొమ్మలా ఉందికదూ."

"నాకు ఆ అమ్మాయిని చేసుకోవటం యిష్టమేనమ్మా," చిరునవ్వుతో జవాబిచ్చాడు. కొడుకు అంత త్వరగా ఒప్పుకుంటాడని ఊహించని ఈశ్వరి ఆశ్చర్యపోయింది. వెంటనే ప్రమీల చాలా వరకు భారతిలా ఉండటమే అందుకు కారణమనికూడా అర్థమైంది.

ఆమె సంతోషంగా ఆ వార్త భర్తతోనూ, వియ్యంకుడితోనూ చెప్పటానికి వెళ్ళింది.

* * *

అగ్నిహోత్రావధాన్లుకి, ప్రమీలకి అన్నవరం కొండమీద పెళ్ళి చాలా సింపుల్‌గా జరిగిపోయింది. భారతి కాని భారతితో ముందుజీవితం ఆనందంగా గడపాలని అతని మనస్సు ఉవ్విళ్ళూరుతోంది.

ప్రమీలతో మొదటిరాత్రి, భారతితో మొదటి అనుభవాన్ని గుర్తుకుతెచ్చి అతని మనసంతా సంతోషం నింపింది.

గతంలో భారతిపట్ల తనుచేసిన పొరపాట్లు యికముందు చేయకుండా– భార్యని ఎలా సుఖపెట్టాలా అని పథకం వేసుకుంటూ చాలా రోజుల తరువాత తృప్తిగా నిద్రపోయాడు, తెల్లవారి తొమ్మిది అయినా లేవని అవధాన్లు.

"ఏమండీ, లేవండీ పొద్దుపోయింది." అంటున్న పిలుపు విని బద్ధకంగా కళ్ళు తెరిచాడు.

ఎదురుగా గాలికి ఎగురుతున్న పొడవాటి కురులతో, ఎర్రని పట్టుచీరలో ఎర్రరాయి ముక్కుపుడక ధరించి చిరునవ్వుతో ముద్దమందారంలా ఉన్న ప్రమీల.... కాదు భారతి....

కిటికీలోనుండి సూర్యకిరణ మొకటి ఆమె ముక్కుపుడక మీద పడి నక్షత్రంలా మెరిసింది.

అతను ఆపుకోలేని ఉద్వేగంతో "భారతీ భారతీ" అంటూ ఆమెను చేరబోయాడు.

"నేను భారతిని కాను.... భారతిని కాను.... ముట్టుకోకండి. యివ్వాళ మహాశివరాత్రి. పూజచేసుకోవాలి," అంటూ గోడకి బల్లిలా అతుక్కుపోయింది ప్రమీల. సప్తసముద్రాలు ఘోషించలేదు. పంచనదులూ ఉప్పొంగలేదు. మిన్ను విరిగి మీదపడలేదు గానీ అవధాన్లు తెరిచిన నోరు తెరిచినట్లే ఉండిపోయింది.